టగ్‌ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాషు, ఇతర అధికారులు

పార్కుల అభివృద్ధి పట్టదా..?

- నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం
- నిరుపయోగంగా 38 పార్కులు

కర్నూలు నగరం ప్రజలకు ఆహ్లాదాన్ని,ఆనందాన్ని, ఆరోగ్యాన్ని పంచేందుకు ఉన్న పార్కులను అన్ని విధ్యాల అభివృద్ధి చేయాలి. పార్కులలో ప్రహరీ చుట్టూ నీడనిచ్చే మొక్కలు నాటి మధ్యలో చిన్న చిన్న అందమైన పూల మొక్కలు నాటి అందులో పిల్లలు ఆడుకునేందుకు కావలసిన పరికరాలు ఏర్పాటు చేయాలి. యువకుల కోసం వ్యాయామం చేసుకునే వీలుగా జిమ్ములాంటి పరికరాలు ఉండాలి. మహిళలు వృద్ధులు పార్కులో నడక సాగించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలి. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామంతో పాటు నడక కూడా అంతే ప్రాధాన్యత వహిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న పార్కులను అభివృద్ధి చేయడంలో కర్నూలు నగరల పాలక సంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. ఒక పక్క కబ్జాకు గురవుతున్నాయి. మరోపక్క అసాంఘిక కార్యకలాపాలకు, కొన్ని పార్కులు ఆకతాయిలకు అనుకూలంగా మారాయి. నగరంలో దాదాపు 38 పార్కులు శిథిలావస్తకు చేరాయి. ఈ నేధ్యంతో పార్కులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ అధికారులు పార్కు స్థలాలు కబ్జా కాకుండా పరిరక్షించే విధంగా చుట్టూ కంచె, ప్రహరీ గోడలు నిర్మించి పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో రాజకీయ నాయకుల అండదండలతో పార్కు స్థలాలను సైతం పట్టాలు ఇప్పించుకొని ఇల్లు నిర్మించే స్థాయికి చేరుతున్నారు. నగరపాలక సంస్థకు సంబంధించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సచివాలయ అధికారులు నిఘా ఉంచి పరిరక్షించాలి. అలా కాకుండా అక్రమార్కులకు అండగా ఉంటూ డబ్బులు దండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో ఇంటి నిర్మాణం జరగాలంటే తప్పనిసరిగా ఇంటి ఆవరణలో మొక్కలను పెంచితే పర్మిషన్ ఇచ్చేటట్లు పాలకమండలి సమావేశాల్లో నిర్ణయం చేయాలి. అప్పుడే మానవునికి కావాల్సిన ఆక్సిజన్ లభిస్తుంది. మనిషికి కావాల్సిన ఆక్సిజన్ సక్రమంగా అందకపోతే కాలుష్యం పెరిగిపోయి ప్రజలు అనారోగ్యాల బారిన పడతారు. కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని పంచే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కర్నూలు నగరాన్ని పచ్చని సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కావలసిన పార్కులు 52 వార్డులలో 152 పార్కులు ఉన్నాయి. అందులో 114 పార్కులు వినియోగంలో ఉన్నాయి. 75 పార్కులకు ప్రహరీ గోడలు ఉన్నాయి. 69 పార్కులలో పచ్చదనం పిల్లలకు కావాల్సిన ఆట వస్తువులు, జిమ్ము లాంటి పరికరాలు ఏర్పాటు చేశారు. 23 సర్కిల్ అభివద్ధి చేసి పచ్చదనం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధాన రహదారుల వెంట 17.8 కిలోమీటర్లు డివైడర్లు అభివృద్ధి చేసి అందులో పచ్చదనాన్ని పెంచారు. దాదాపు 38 పార్కులు గాలికి వదిలేశారు.

అందులో వీకర్‌సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కు ఒకటి. ప్రహరిగోడను కూల్చి ఓ కార్పొరేటర్ వ్యాపార ప్రయోజనాలకు వాడుకున్నా అడిగే దిక్కులేదు. 10 వేలకుపైగా ఓటర్లు ఉన్న వీకర్ సెక్షన్ కాలనీకి వాకింగ్ ట్రాక్ ఉండే సరయిన పార్కులేదు. దీనిని అన్ని విధాల అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

పార్కుల నిర్వహణకు సిబ్బంది: పార్కుల నిర్వహణ, డివైడర్లలో పచ్చదనం పరిరక్షించేందుకు 21 మంది రెగ్యులర్ వర్కర్లు ఉన్నారు. అందులో ముగ్గురు పదవి విరమణ చేశారు. ప్రస్తుతం 18మంది మాత్రమే పని చేస్తున్నారు. నగరపాలక సంస్థలో పార్కుల అభివృద్ధి కోసం శివారు ప్రాంతాల్లో 28 మంది పనిచేస్తున్నారు. 21 మంది కాంట్రాక్టు కింద పనిచేస్తున్నారు. ఇందులో రాధమ్మ డెవలప్మెంట్ సొసైటీ, అమీన్ కాంట్రాక్టర్లు తమ మనుషుల ద్వారా పనులు చేస్తున్నారు. తగిన సిబ్బందిని నియమించి అన్ని పార్కుల అభివృద్ధికి కృషి చేయాలి.

శిథిలావస్థకు చేరిన పార్కులను అభివృద్ధి చేయాలి

- ఇ.పుల్లారెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు

నగరంలో ఉన్న పార్కులు మున్సిపల్ అధికారులు ఎలాంటి శ్రద్ధ వహించక పోవడంతో కొన్ని పార్కులు అన్యాక్రాంతమవుతుంటే మరికొన్ని పార్కులు పట్టించు కునే నాథుడు లేక పిచ్చి మొక్కలు కంపచెట్లకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. అలాంటి పార్కుల్లో ప్రధానంగా వీకర్ సెక్షన్ కాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య పార్కు చెప్పుకోవచ్చు. ఈ పార్కు పేరు గొప్ప ఊరు దిబ్బగా మారింది. సుందరయ్య పార్కును సుందరంగా తీర్చిదిద్ది అందరికీ ఉపయోగకరంగా మార్చాలి.

ఆరోగ్యాలకు ప్రాధాన్యతనివ్వాలి

- షేక్ జరీనా ,రాంప్రియ నగర్

నగరంలోని వార్డుల్లో ఉన్న పార్కు స్థలాలను అభివృద్ధి చేసి నడకకు ప్రాధాన్యత ఇచ్చి మహిళల ఆరోగ్యాలు కాపాడాలి. ఆరోగ్యాన్ని మించిన సంపద లేదు. నగరంలో రోడ్లపై తిరిగేందుకు వీల్లేకుండా పోయింది. ఎక్కడ చూసినా వాహనాల రద్దీ. దీనితో బయటకు వెళ్లకుండా ఇళ్లలో మహిళలు టివిలకు అతుక్కుపోయి కూర్చోవడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారు. మహిళల ఆరోగ్యాలు కాపాడేందుకు పార్కులను అభివృద్ధి చేయాలి.

ఫిర్యాదులు వస్తే పార్కు స్థలాలను శుభ్రం చేస్తాం

- డిఇఇ శ్రీనివాసరెడ్డి

పార్కులు శిథిలావస్థకు చేరిన, పిచ్చి మొక్కలు పెరిగాయని ఆయా ప్రాంతాల ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే వాటిని శుభ్రం చేసి ఇస్తున్నాం. చుట్టూ కంచెలు ప్రహరీ గోడలు నిర్మించాలంటే ఆ ప్రాంత అవసరాల దృష్ట్యా అంచనాలు వేసి వాటిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

రూ.1.4 కోట్లతో విజయవనం అభివృద్ధి

- కార్తీక వన మహోత్సవంలో కలెక్టర్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

విజయవనాన్ని రూ.1.4 కోట్లతో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. బుధవారం కర్నూలు నగర శివార్లలోని వెంకన్న బావి దగ్గర ఉన్న విజయవనం (పుల్లయ్య పార్క్) లో జిల్లా అటవీ శాఖ అధికారి ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విజయవనం పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణంతో అలరారుతోందన్నారు. ప్రస్తుతం కోటి రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు, మరో రూ.40 లక్షలతో యోగా పార్క్, పిల్లల ఆటలు ఆడే ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ పార్కును పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. నిత్యం పని ఒత్తిడి తో ఉండే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు కాసేపు వాటిని మర్చిపోయి ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్ ఆటల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ టగ్‌ఆఫ్ వార్, వాలీ బాల్ ఆటల్లో, జాయింట్ కలెక్టర్ మ్యూజికల్ చైర్స్ లో అధికారులతో కలిసి ఆడారు.. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ మహేశ్వర రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్‌ఇ రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎపి ఎంఐపి పిడి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మ్యూజికల్ చైర్ పోటీలో పాల్గొన్న మహిళా అధికారులు జెసి , తదితరులు

స్వచ్ఛభారత్ కార్మికులకు జీతాలు విడుదల చేయాలి

- ఎఒకు వ్యకాస, రైతు సంఘం వినతి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలోని లొద్ది పల్లె గ్రామ స్వచ్ఛభారత్ కార్మికుల 20 నెలల పెండింగ్ జీతాలను విడుదల చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్ మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆనంద్,రవి, మాలిక్ బాష డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ పరిపాలన అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్మికులకు 20 నెలలుగా జీతాలు రాకపోతే వారు వారి కుటుంబం ఏ విధంగా జీవించాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు 20 నెలల జీతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఒ స్పందిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న జి.రామకృష్ణ, తదితరులు

అందరికీ విద్య అందించాలి

- ఎమ్‌డి.ఆనంద్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజంలోని అన్ని వర్గాల వారందరికీ విద్య అందిస్తేనే అభివృద్ధి ఫలాలు అందుతాయని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు నగర్ కార్యదర్శి సాయి ఉదయ్ అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో బి క్యాంపు లోని టౌన్ జూనియర్ కళాశాలలో పూలే మరియు అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పూలే చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా పాలక ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శి ఆర్యన్, కాలేజీ కార్యదర్శి మధు, మూర్తి, కళాశాల ప్రిన్సిపల్ షీలా పాల్గొన్నారు.

పర్యవేక్షణాధికారులపై చర్యలు

- డిఇఒ శ్యామ్యూల్ పాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఎ మార్కుల నమోదులో జాప్యం చేస్తున్నా పర్యవేక్షణాధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా విద్యాధికారి ఎస్ శ్యామ్యూల్ పాల్ హెచ్చరించారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులతో వెబెక్స్ ద్వారా డిఇఒ సమీక్షించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 71శాతం ప్రైవేట్ పాఠశాలలు ,75శాతం ఎయిడెడ్ పాఠశాలలు, 65శాతం నమోదు చేశారన్నారు. ప్రత్యేకంగా కర్నూలు, ఆదోని, కోసిగి, మండలాలు వెనక పడ్డాయని అన్నారు. మెగా పేరెంట్స్ సమావేశం ఎలా నిర్వహిస్తామని ప్రశ్నించారు. సమావేశం ప్రారంభమయ్యేలోపు ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో విద్యార్థుల స్క్రీనింగ్ టెస్ట్‌లు పాఠశాలల్లో 40 పాఠశాలల్లో చేయాల్సి ఉందని, అది కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యాశాఖ ఆదేశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికే అపార్ 46000 జనరేట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని అప్లోడ్ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. పర్యవేక్షణ అధికారుల పనితీరులో మార్పు రావడం లేదన్నారు. ఇక ఇలాగే కొనసాగితే ఉపేక్షించేది లేదని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

వై.నాగేశ్వరరావు యాదవ్‌ను పరామర్శిస్తున్న కెఇ.కృష్ణమూర్తి, పి.తిక్కారెడ్డి

నాగేశ్వరరావు యాదవ్‌ను పరామర్శించిన కెఇ.కృష్ణమూర్తి, పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఈ నెల 25న తేదీన అనారోగ్యంతో హైదరాబాద్లో ఆర్కేటి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌ను పోలిట్బ్యూరో సభ్యులు కెఇ కృష్ణమూర్తి, కర్నూలు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై. నాగేశ్వరరావు యాదవ్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని మేమంతా మీకు అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ త్వరగా కోల్కొని దైనందిన కార్యక్రమాలలో యథాతథంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. మనోధైర్యాన్ని కల్పించారు.

మంత్రి టిజి భరత్‌ను కలిసిన పాలకవీటి విజయకుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర పరిశ్రమలు , ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్‌ను ఎపి నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ మౌర్యఇన్‌లోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పాలక వీటి విజయకుమార్‌ను నియమించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని, అందుకు నిదర్శనం పాలవీటి విజయకుమార్‌ను ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించడమేనని మంత్రి టిజి.భరత్ అన్నారు. పాలకవీటి విజయకుమార్ తెలుగుదేశం పార్టీలో రాజకీయంగా గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అంచలంచెలుగా ఎదిగి రాష్ట్రస్థాయిలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎదగటం చాలా సంతోషించదగ్గ విషయమని మంత్రి తెలిపారు. టిడిపిలో కష్టపడి పనిచేసే బీసీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సముచిత స్థానం కల్పిస్తారని మంత్రి తెలిపారు.

వేతన , పెన్షన్ సవరణ చేయాలి

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిఎస్ఎన్ఎల్‌లో పనిచేసే ఉద్యోగులకువేతన సవరణ, పెన్షన్ సవరణ, 4జి,5జి సర్వీసులు ప్రారంభం , కాంట్రాక్ట్ ,క్యాజువల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆల్ ఇండియా పిలుపులో భాగంగా బిఎస్ఎన్ఎల్ కోఆర్డినేషన్ కమిటీ, బిఎస్ఎన్ఎల్ ఇ యు, ఎఐబిడిపిఎ, సిసి డబ్ల్యు ఎఫ్ ల ఆధ్వర్యంలో బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్‌లో నెలకొని ఉన్న క్యాజువల్, కాంట్రాక్ట్ లేబర్ సమ స్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.స్టాగ్నేషన్ కారణంగా వేలాది మంది నాన్‌ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు అనేక ఇంక్రిమెంట్లను కోల్పోయారని, వేతన సవరణను పరిష్కరించక పోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందనీ చెప్పారు. బిఎస్ఎన్ఎల్ లోని లక్షలాది మంది రిటైర్డ్ ఉద్యోగుల జీవనోపాధిని నేరుగా దెబ్బతీసిన పెన్షన్ రివిజన్ సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేదని చెప్పారు. బిఎస్ఎన్ఎల్‌ను నష్టాల్లోకి నెట్టిన తర్వాత, దాని ప్రైవేట్ అనుకూల విధానాల ద్వారా, బిఎస్ఎన్ఎల్ పేలవమైన ఆర్థిక పరిస్థితి కారణంగా వేతన సవరణ , పెన్షన్ సవరణలు పరిష్కరించలేదని ప్రభుత్వం చెబుతోందన్నారు. వీలైనంత త్వరగా వేతన సవరణ ఒప్పందంపై సంతకం చేసేందుకు బిఎస్ఎన్ఎల్ ఇయు ప్రయత్నిస్తోందని అన్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్‌ల కొత్త పే స్కేల్స్‌పై కుదిరిన ఒప్పందం నుండి వెనక్కి వెళ్లి మేనేజ్‌మెంట్ అనేక అడ్డంకులు సృష్టించిందన్నారు. లక్షలాది మంది కొత్త కస్టమర్లు బిఎస్ఎన్ఎల్‌కు వలసపోతున్నారని, కానీ బిఎస్ఎన్ఎల్ 4జి,5జి లాంచింగ్‌లలో విపరీతమైన జాప్యం కారణంగా బిఎస్ఎన్ఎల్ వారికి మంచి నాణ్యత గల వాయిస్ , డేటా సేవలను అందించలేకపోతుందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడం లేదని, బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంట్, కాంటాక్ట్ వర్కర్ల ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా, తన బాధ్యత నుండి తప్పించుకుంటుందని విమర్శించారు. క్యాజువల్ కార్మికులకు 7వ సిపిసి పేస్కేల్ ఆధారంగా వారి వేతనాలు నిరాకరించబడు తున్నాయన్నారు. పైన పేర్కొన్న సమస్య లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న బిఎస్ఎల్ ఉద్యోగులు

జెసిదివాకర్‌రెడ్డి మాటలను ఉపసంహరించుకోవాలి

ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆటో డ్రైవర్లే ప్రమాదాలకు కారణ మంటూ తెలుగుదేశం సీనియర్ నాయకులు జెసి దివాకర్‌రెడ్డి ఆటో డ్రైవర్లను కించపరుస్తూ మాట్లాడిన మాటలను తక్షణమే ఉపసంహ రించు కోవాలని ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు.బుధవారం కార్మిక కర్షక భవన్లో కర్నూలు మండల ఆటో డ్రైవర్ల సమావేశం శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వచ్చిన కార్మికులదేశించి కె. ప్రభాకర్ మాట్లాడుతూ జరిగే ప్రమాదాలు ఆటో డ్రైవర్లే చేస్తున్నట్టు దివాకర్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని వాటిని విశ్లేషించకుండా ఆటో డ్రైవర్లే ప్రమాదాల కారణమంటూ జెసి దివాకర్ రెడ్డి చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను ముందుగా పరిష్కరించాలని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రాష్ట్రంలో అనేకమంది నిరుద్యోగులు ఏదో ఒక వృత్తి చేసుకొని బతుకుతున్నారన్నారు. అందులో ఆటోలు నడుపుతూ అనేకమంది నిరుద్యోగులు వారి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాల నివారణకు పలు సూచనలు ఇవ్వాలన్నారు. సమాజంలో గుర్తింపుగల నాయకులు ఆటో డ్రైవర్లను తప్పులు సవరించుకోమని చెప్పాలన్నారు. డ్రైవర్లను కించపరుస్తూ వారిని అవమానం చేయడం సరికాదని వారన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం, పెరుగుతున్న ధరలను నియంత్రించలేని నాయకులు డ్రైవర్ల గురించి మాట్లాడడం హేయమైన చర్య అన్నారు. ఆటో కార్మిక సంఘంగా ఇలాంటి వాటిని ఖండిస్తున్నామన్నారు. డ్రైవర్లు కూడా తగు జాగ్రత్తలు తీసుకొని ఆటో నడపాలని, ప్రమాదాలు ఆటోల వల్లే జరుగుతున్నా యని చెడ్డ పేరు తీసుకురాకుండా ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మహమ్మద్, చిన్న కంగాల్ ,ప్రసాద్, పెద్దయ్య, షేక్‌షా, హనుమంతు. ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి తోడ్పాటు

డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాగిణి

ప్రజాశక్తి-మద్దికేర : రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాగిణి ఆధ్వర్యంలో బుధవారం మద్దికేర కెవిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య,ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి సౌభాగ్యమని అందులో భాగంగా మండలంలోని ఆరు నెలల నుండి 18 సంవత్సరం లోపల పిల్లలందరికీ అంగన్వాడీలు, అన్ని పాఠశాలల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, చిన్నతనంలో వచ్చు పౌష్టికాహార లోపాలు, చిన్నతనంలో వచ్చు రోగాలు, వయసుకు తగ్గ శారీరక, మానసిక పెరుగుదల లేకపోవడం, అంగవైకల్య లక్షణాలు వంటి ఏదైనా లోపాలు ఉంటే పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ వారిఆరోగ్య ప్రగతిని వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, మంచిఅలవాట్లు, ప్రభుత్వం అందించే వైద్య ఆరోగ్య సేవలు, లింగవివక్షత, బాల్యవివాహాలు, మంచిస్పర్శ,చెడుస్పర్శ, బాలికవిద్య, పోషకాహార ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ, సూర్యనారాయణ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అంజలి, ఐశ్వర్య, స్వాతిస్కూల్ హెడ్మాస్టర్ అజారయ్యబాబు,సిబ్బంది, ఆశాలుపాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు...

-నెలకిందట తవ్విన రోడ్డు...సరిచేయని కాంట్రాక్టర్

-ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు నగరం కష్ణానగర్ ప్రాంతంలో కేబుల్ వైర్లు మరమ్మతుల కోసం ఆయా కంపెనీలు రోడ్డును తవ్వాయి. పనులు పూర్తి చేసిన తరువాత గుంతలను తాత్కాలికంగా పూడ్చివేశారు. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రహదారిపై రాళ్లు కంకర ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు సదరు కాంట్రాక్టర్ సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు వందలాది వాహనాలు పాదచారులు రాకపోకలు సాగిస్తుండడంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అస్తవ్యస్తంగా ఉన్న రహదారి వల్ల తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాహదారులు పాదాచారులు విమర్శిస్తున్నారు. దీంతో కేబుల్ వైర్ల పాపం...ప్రజలకు శాపంగా మారింది.

అభివృద్ధిలో ఇద్దరూ కీలకమే..!

- అధికారులు మధ్యలోనే పోవడం మంచి పద్ధతి కాదు
- సర్వసభ్య సమావేశంలో ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి హేమలత

అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇద్దరూ కీలకమేనని ఎంపిపి జూటూరు హేమలత తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపిపి హేమలత అధ్యక్షతన ఎంపిడిఒ అల్లాబకాష్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభించగానే అధికారులు నివేదికలను వినిపిస్తుండగా సర్పంచులు నీలకంఠ, గోవిందరాజులు, పురుషోత్తం, సావిత్రమ్మ, పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. విద్యుత్ స్తంభాలు ఇచ్చే వాటిపై, పాఠశాలల్లో వసతులపై, పశు వైద్య శాఖలో అందిస్తున్న మినీ గోకులం షెడ్లపై, పశుగ్రాసంపై ప్రజలకు సరైన సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. ఎఒ జయలక్ష్మి మాట్లాడుతూ... రబీ సీజన్‌కుగాను మండలంలో 241 మంది రైతులకు సబ్సిడీ శనగలను అందించామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇన్స్యూరెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించేదని, ప్రస్తుత ప్రభుత్వం రైతులు చెల్లించేలా వెసలుబాటు కల్పించిందని చెప్పారు. సూపర్‌వైజర్ ప్రసూన మాట్లాడుతూ... పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల చుట్టూ ఉన్న ముళ్లచెట్లను తొలగించాలని సర్పంచులను కోరారు. అనంతరం ఎంపిపి మాట్లాడారు. సమావేశం జరుగుతున్నప్పుడు మధ్యలోనే అధికారులు వెళ్లిపోతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని తెలిపారు. ఒకవేళ ముఖ్యమైన పని ఉంటే సమాచారం ఇచ్చి వెళితే బాగుంటుందని చెప్పారు. గ్రామాల్లో వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను కల్పించాలని ఎపిఒ జుబేర్ అహ్మద్‌ను కోరారు. సమావేశంలో వచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులు సమన్వయం చేసుకొని వెళితే వచ్చిన సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఎంపిటిసిలు భీమలింగ, సుంకన్న, సుమలత, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న, పిఆర్ ఎఇ సోమప్ప, ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్, ఎంఇఒ శ్రీనివాస్ రెడ్డి, ఎపిఎం నాగార్జున, వెటర్నరీ డాక్టర్ ప్రసన్న బాయి, హౌసింగ్ ఎఇ భవ్య పాల్గొన్నారు.

ఇంటి పన్ను ఆన్‌లైన్ ప్రక్రియను 30లోపు పూర్తి చేయాలి

- డిఎల్‌పిఒ నూర్జహాన్

ప్రజాశక్తి - గోనెగండ్ల


వివరాలు తెలుసుకుంటున్న డిఎల్‌పిఒ

ఇంటి పన్ను ఆన్‌లైన్ ప్రక్రియను ఈనెల 30లోపు పూర్తి చేయాలని ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్ తెలిపారు. బుధవారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి పన్నుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ... పంచాయతీ పరిధిలో ఇళ్ల యజమానులు పన్ను చెల్లించి ఒకసారి ఆన్‌లైన్ చేయించుకుంటే భవిష్యత్తులో ఇంటి పన్ను పంచాయతీ కార్యాలయానికి రాకుండానే ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చెల్లించుకోవచ్చని తెలిపారు. గోనెగండ్ల మేజర్ పంచాయతీలో 4,600 ఇళ్లకు గాను 2,600 ఇళ్ల వివరాలను ఆన్‌లైన్ చేసి 55 శాతం పూర్తి చేశారని చెప్పారు. మిగిలిన వాటిని కూడా ఈనెల 30లోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు నిర్ణీత గడువులోపు ఇంటి పన్నులు చెల్లించి ఆన్‌లైన్ చేసుకొని గోనెగండ్లను స్వర్ణ పంచాయతీగా మార్చేందుకు సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనమందించాలి

- తహశీల్దార్ కుమారస్వామి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహశీల్దార్ కుమారస్వామి ఆదేశించారు. గ్రామసభలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ కుమారస్వామి బుధవారం ఎర్రబాడు గ్రామంలోని భూములను పరిశీలించారు. గ్రామ సభలో వచ్చిన అర్జీలన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఎర్రబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీల నిర్వహకులు విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని తెలిపారు.

ఇక్కడ ఎలా ఉండేది..?

- రోడ్లు, డ్రైయినేజీ సదుపాయం లేదు
- దశాబ్ధ కాలంగా అభివృద్ధికి నోచని కాలనీ

ప్రజాశక్తి - ఆదోని

రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో చిన్నపాటి వర్షమొచ్చినా ఇళ్ల మధ్య బురదమయంగా మారుతోందని, ఇక్కడ ఎలా ఉండేదంటూ కాలనీ మహిళలు వాపోయారు. బుధవారం పట్టణ శివారులోని సాయి నగర్‌లో ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హాజరయ్యారు. కాలనీ మహిళలు వీరమ్మ, లక్ష్మి మాట్లాడుతూ... కాలనీ ఏర్పడి దశాబ్ధ కాలం అయినప్పటికీ డ్రెయినేజీ, రోడ్డు సదుపాయం లేదని తెలిపారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో కారు చీకట్లోనే మగ్గిపోతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. శివారు ప్రాంతంలో ఉండడం వల్ల అధికారులు ఎవరూ తమ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చీకటి కారణంగా విషపురుగులు సంచరిస్తున్నాయని, ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇంటింటికీ కుళాయి లేదని, వీధి కుళాయి ద్వారానే తాగునీరు తెచ్చుకుంటున్నామని చెప్పారు. కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయించి, ముళ్లచెట్లు తొలగించి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీ సమస్యలను వెంటనే పర్యవేక్షించి అక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించి.. మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు లాగి.. లైట్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ డిఇని ఫోన్ ద్వారా ఆదేశించారు. రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటుకు ప్రతిపాదనను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణకు ఫోన్‌లో తెలిపారు.

సమస్యను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న కాలనీ వాసులు

డబ్ల్యుయుఎ ప్రెసిడెంట్లుగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే బీవీకి ధన్యవాదాలు

- ఎన్.గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటర్ (డబ్ల్యుయుఎ) ఛానల్-1కి ప్రెసిడెంట్‌గా హాలహర్వి గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి చిన్న నరసింహారెడ్డి కుమారుడు ఎన్.గోవర్ధన్ రెడ్డి, గంగవరం డిస్ట్రిబ్యూటర్ (డబ్ల్యుయుఎ) ఛానల్-1కు బోయ ఎర్రం నాయుడును ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. చిన్నకొత్తిలి, గంగవరం డిస్ట్రిబ్యూటర్ (డబ్ల్యుయుఎ) ఛానళ్లకు తమ గ్రామానికి చెందిన వారికి ప్రెసిడెంట్ పదవులు ఇచ్చినందుకు ఎమ్మెల్యే బీవీకి ధన్యవాదాలు తెలిపారు. అలాగే వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా డిస్ట్రిబ్యూటర్ ఛానల్ నుంచి రైతులకు సాగునీరు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు.

సమయపాలన పాటించని సిబ్బంది

- 11 గంటలైనా తెరచుకోని సచివాలయం

ప్రజాశక్తి- దేవనకొండ

గత ప్రభుత్వంలో గ్రామంలోనే ప్రజల సమస్యలు పరిష్కరించడానికి సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ వ్యవస్థను కొనసాగిస్తోంది. సచివాలయం సిబ్బంది మాత్రం సమయపాలన పాటించడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. కిందిస్థాయి సిబ్బంది పనితీరు చూసుకోవాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో 'ఆడిందే ఆట.. పాడింది పాట' అన్నచందంగా తయారైంది.

మండలంలోని ఐరన్ బండ బి సెంటర్ గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. బుధవారం ఉదయం 11.30 గంటలైనా ఏ ఒక్క సిబ్బంది హాజరు కాలేదు. సచివాలయ కార్యాలయ తలుపులు తెరచుకోలేదు. గ్రామస్తులను సచివాలయ సిబ్బంది పనితీరుపై విచారించగా రోజూ వారు వచ్చే సమయం 11 గంటలపైనే అని తెలిపారు. సచివాలయ పరిధిలో గుమ్మరాళ్ల, లక్కందిన్నె, ఐరన్ బండ గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

11 గంటలైనా తెరచుకోని సచివాలయం

కురువలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం

- కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని

కురువ సామాజిక వర్గానికి ఆర్థిక ప్రయోజిత పథకాలు అమలు చేసి వారి అభివృద్ధికి సహకరిస్తామని కురుబ/కురుమ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. బుధవారం విజయవాడ గొల్లపూడి బీసీ భవనంలో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మాన్వి దేవేంద్రప్ప చేత బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ ప్రమాణం చేయించారు. బాధ్యతల స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సావిత్రమ్మకు ధన్యవాదాలు తెలిపారు. దేవేంద్రప్ప మాట్లాడుతూ... రానున్న రోజుల్లో కార్పొరేషన్ నిధుల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా కృషి చేస్తామని తెలిపారు. ఎంతో నమ్మకంతో ముఖ్యమంత్రి తనకు అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని చెప్పారు.

దేవేంద్రప్పకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆధునిక పద్ధతులు అలవాటు చేసుకోవాలి

- ఎడిఎ సునీత, ఎఒ జయలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులను అలవాటు చేసుకోవాలని ఎడిఎ సునీత, ఎఒ జయలక్ష్మి రైతులకు సూచించారు. బుధవారం నేమకల్లు గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రతాప్ నాయుడు, జ్యోతిర్మయి ఆధ్వర్యంలో 'పొలంబడి' నిర్వహించారు. పొలాల్లో రైతుల దగ్గరకెళ్లి పంటలను పరిశీలించి, అధిక దిగుబడుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంట మార్పిడి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. మట్టి నమూనాలు పరీక్షించుకోవడం వల్ల భూమిలో ఏ లోపం ఉందో తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కృత్రిమ ఎరువులు వాడడం మంచిదని సూచించారు. రబీ పంటలకు ఇన్స్యూరెన్స్ చెల్లించుకోవాలని రైతులను కోరారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు రంగస్వామి, కుమార్, రంగయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

నేమకల్లు గ్రామంలో 'పొలంబడి'లో పాల్గొన్న అధికారులు

అదుపు తప్పి ఆటో బోల్తా

- నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో నలుగురికి గాయాలైన సంఘటన బుధవారం గోనెగండ్ల మండలంలో చోటుచేసుకుంది. గంజిహళ్లి గ్రామానికి చెందిన ఆటో గోనెగండ్ల నుంచి గంజిహళ్లికి వెళ్తుండగా ఎల్ఎల్‌సి బ్రిడ్జి దాటిన తర్వాత మలుపు వద్ద ఆర్‌టిసి బస్సును తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. గంజిహళ్లి గ్రామానికి చెందిన తలారి రామాంజనేయులు, మాల నరసమ్మ, మరో మహిళతో పాటు అయ్యకొండ గ్రామానికి చెందిన పెద్ద రంగన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు.

ఆటోను పైకి లేపుతున్న స్థానికులు

మహిళల ప్రోత్సాహానికి కృషి

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పొదుపు సంఘాల మహిళలు సొంతంగా తయారు చేసిన వస్తువులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని

మెప్మా బజార్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం పొదుపు సంఘాల (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ పరిశీలించారు. అనంతరం పొదుపు మహిళలు తయారు చేసిన వస్తువులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. పొదుపు సంఘాల సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు పెంచి వెసలుబాటు కల్పించారన్నారు. త్వరలోనే పట్టణంలో మెప్మా బజార్‌తో పాటు మెప్మా సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ చేపడతామని తెలిపారు. మహిళలు చేతుల ద్వారా చేసే వస్తువులను మెప్మా బజార్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మెప్మా సిబ్బంది జయవర్ధన్ పాల్గొన్నారు.

టోర్నమెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా.. మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి స్మారక అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీవీ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో క్రికెట్ టోర్నమెంట్ గోడపత్రికను విడుదల చేశారు. డిసెంబర్ 5 నుంచి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుందని తెలిపారు. జనవరి 15న ఫైనల్ ఉంటుందన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు సురేష్ చౌదరి, రంగస్వామి గౌడ్, దోమ భీమేష్, ముల్లా జహీర్ అహ్మద్, భార్గవ్ యాదవ్, యుకె.వీరేంద్ర, కృష్ణ తేజ నాయుడు, సోగనూర్ రాఘవేంద్ర, శంకర్ గౌడ్, అమానుల్లా, రఘు, నాగలదిన్నె సుధీర్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం.31/2022
షేక్.మహమ్మద్ గౌస్ ... అర్జీదారు
-వర్సెస్-
కటిక ఇనామల్ హక్ మరియు వగైరా ... రెస్పాండెంట్లు
15,24 వ రెస్పాండెంట్లకు నోటీసులు
15.) కె.విజయబాస్కర్ తండ్రి కె.నారాయన్ కొడిదెల, ఇంటి.నెం.77/1183,భగవాన్ నగర్, కల్లూరు ఎస్టేట్, కర్నూలు సిటి.సెల్.నెం.9581373732.
24). బోయ.విజయబాస్కర్ తండ్రి బోయ.ఈశ్వరయ్య, ఇంటి.నెం.82/151/2, శరీన్ నగర్, కర్నూలు సిటి. సెల్.నెం.9885813342.
పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు షేక్.మహమ్మద్ గౌస్ తండ్రి షేక్.అన్వర్‌బాష, నివాసం. ఇంటి.నెం.51/15-18-10ఇ-2-1,బాబ బృందావన్ నగర్, కర్నూలుసిటి అను నతడు తనను దావాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి అర్జీ దాఖలు చేసినాడు. ఇందుపైన 15,24 వ రెస్పాండెంట్లు అయిన మీ కు ఏమైన అక్షేపణలు వున్న యెడల 26-12-2024వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 26-12-2024
హెచ్.కె.జలంధర్
జి.గోపాల క్రిష్ణయ్య
అర్జీదారు తరుపు అడ్వకేట్లు
కర్నూలు.

విద్యుదాఘాతంతో అపస్మారక స్థితిలోకి రైతు

ప్రజాశక్తి - హొళగుంద

విద్యుదాఘాతానికి రైతు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. బుధవారం రైతు ఈడిగ విరుపన్న పొలంలో ట్రాక్టర్‌తో పని చేసుకుంటున్నారు. విద్యుత్ వైర్ తెగి కింద పడిందని, కరెంటు లేకపోవడంతో రెండు వైర్లను జాయింట్ చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కరెంటు రావడంతో విద్యుదాఘానికి గురై పొలంలో కుప్పకూలిపోయారు. పక్కనే పొలంలో ఉన్న రైతులు గమనించి విరుపన్నను ప్రథమ చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్టాఫ్ నర్స్ రత్న బాయ్ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేశారు. చికిత్స నిమిత్తం రైతును బళ్లారికి తీసుకెళ్లారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

- నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌ఛార్జీ సూర్య

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలో అన్ని శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ రీజినల్ ఇన్‌ఛార్జీ మోపిరి సూర్య డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరంలో కలెక్టర్ రంజిత్ బాషను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్లుగా పని చేసిన దళిత, గిరిజన యువత ఇంటర్, డిగ్రీ చదివి కేవలం రూ.5 వేలకే పని చేసి ప్రజలకు సేవలందించారని తెలిపారు. వాలంటీరు వ్యవస్థను రద్దు చేయడం సమంజసం కాదని చెప్పారు. కూటమి ప్రభుత్వం బ్యాక్‌లాగ్ పోస్టులపై నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీలను ఆదుకోవాలని కోరారు.

కలెక్టర్ రంజిత్ బాషకు వినతిపత్రం అందజేస్తున్న సూర్య

పని ఒత్తిడికి గురవుతున్నాం...

- అదనపు బాధ్యతల నుంచి మినహాయింపు ఇవ్వాలి
- సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

పనిభారంతో మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యాల పాలవుతున్నామని, అదనపు బాధ్యతల నుంచి మినహాయింపు ఇవ్వాలని గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు వేణుగోపాల్, వెంకప్ప, చంద్రశేఖర్ కోరారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దినసరి బాధ్యతలతో పాటు సర్వేల పేరుతో తాము పని ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. ఒక సర్వే పూర్తికాకుండానే మరో సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామన్నారు. బిఎల్‌ఒలు, ఇతర సర్వేల పేరుతో దినసరి బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రెండేళ్లుగా బిఎల్‌ఒగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఎలాంటి పారితోషికం రాలేదన్నారు. పని ఒత్తిడి కారణంగానే నంద్యాలలో సచివాలయ సెక్రటరీ హరినాథ్ రెడ్డి మృతి చెందారని చెప్పారు. తమ విధులను సక్రమంగా నిర్వహించుకునేలా అదనపు బాధ్యతల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అంతకుముందు హరినాథ్ రెడ్డి మృతికి నివాళిగా కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పించారు. ప్రభుత్వానికి వినతి పంపి పని ఒత్తిడి కాకుండా చూస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులు నాగరాజు, పాములేటి, శ్రీమన్, రుద్ర గౌడ్, రమాదేవి, ప్రణతి పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

రోడ్డు ప్రమాదంలో... ఇద్దరు అధికారులకు గాయాలు

ప్రజాశక్తి -దేవనకొండ

గాయాలకు గురైన ఎక్సైజ్ సిఐ సుభాషిని

దేవనకొండ-పత్తికొండ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులకు గాయాలయ్యాయి. మద్యం దుకాణాల తనిఖీల్లో భాగంగా పత్తికొండ నుంచి దేవనకొండ గ్రామానికి ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ సిఐ సుభాషిని సిబ్బందితో కారులో బయల్దేరారు. దేవనకొండకు రెండు కిలోమీటర్ల దూరంలో గుంతను తప్పించబోయి కారు అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న సిఐ సుభాషిని, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాములుకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాణ్యతగా సిసి రోడ్డు నిర్మాణాలు

- సర్పంచి కరివేముల సావిత్రి

ప్రజాశక్తి - చిప్పగిరి

నాణ్యతతో కూడిన సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని సర్పంచి కరివేముల సావిత్రి సంబంధిత కాంట్రాక్టుదారులకు సూచించారు. బుధవారం బెల్డోన గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో డ్రెయినేజీతో కూడిన సిసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డు పది కాలాలపాటు పదిలంగా ఉండాలంటే నాణ్యతకు పెద్దపీట వేసి నిర్మించాలని తెలిపారు. గ్రామంలో సమస్యలు ఉన్న వీధుల్లో త్వరలోనే సిసి రోడ్లు వేసేందుకు తీర్మానాలను ఉన్నతాధికారులకు పంపించామన్నారు. టిడిపి నాయకులు గోవిందు, నెట్టికల్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచి, అధికారులు

చట్టాలపై అవగాహన అవసరం

- అడ్వకేట్ లలిత

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలకు పరిష్కారం దొరకక చాలామంది నష్టపోతున్నారని, ప్రస్తుత తరుణంలో చట్టాలపై అవగాహన కలిగి ఉంటే న్యాయం పొందవచ్చని అడ్వకేట్ లలిత తెలిపారు. బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు 'సైబర్ నేరాలు-చట్టాలు' అనే అంశంపై ప్రిన్సిపల్ మురళీమోహన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ లలిత చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐటి చట్టం, ఐపిసి, ఎన్‌సిఆర్‌పి చట్టాల్లో ఉన్న అంశాలను క్లుప్తంగా వివరించారు. ఎవరైనా ఫేక్ కాల్స్ చేసి బెదిరించే సమయంలో భయపడకుండా సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. లేకపోతే ఎన్‌సిఆర్‌పి జాతీయ సైబర్ క్రైమ్ రిజిస్టరింగ్ పోర్టల్‌కు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. అక్కడి నుంచి తగిన పరిష్కారం లభిస్తుందన్నారు. నేటి కాలంలో తెలియని లింక్‌లను మొబైల్‌లో క్లిక్ చేయడం వల్ల అనేక మంది డబ్బును పోగొట్టుకొని మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. చావు పరిష్కారం కాదని, సైబర్ క్రైమ్ బ్రాంచిని ఆశ్రయించటం ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. చదువుకోలేని తల్లిదండ్రులకు విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్ విక్లీఫ్, ఉమాదేవి, వెంకట్రామి రెడ్డి, మధు, వెంకటేశ్వర్లు, సంతోషి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లలిత

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీమఠం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం శ్రీమఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు ఉచిత కంటి వైద్య సేవలను ప్రారంభించారు. సుమారు 150 మంది ఈ వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకున్నారు. అందులో సుమారు 50 మందికి ఆపరేషన్లు అవసరమని ఆర్‌కె కంటి వైద్యశాల నిపుణులు డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. ఎమ్మిగనూరులోని ఆర్‌కె కంటి ఆస్పత్రికి చెందిన ప్రత్యేక వైద్యులు, వైద్య సిబ్బంది నిర్వహించిన కాంప్లిమెంటరీ కంటి పరీక్షలు, చికిత్స, కంటిశుక్లం కోసం స్క్రీనింగ్‌లను భక్తులు, మంత్రాలయం పరిసర గ్రామాల ప్రజలు ఉపయోగించుకున్నారు. శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాల వైద్యులు డాక్టర్ సుజయీంద్ర రావు, కోఆర్డినేటర్ విజయీంద్ర రావు, ఫార్మాసిస్టు ప్రదీప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, ట్యాంక్ బండ్ రోడ్డు ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పట్టణ పరిశుభ్రత కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్): ఆదోని
S.O.P.No.08/2024
Between:
1. సోమా లక్ష్మీదేవి
2. పద్మశాలే దేవేంద్రమ్మ ...పిటిషనర్స్
// VS //
బ్రాంచ్ మెనేజర్, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా. ...రెస్పాడెంట్
జనరల్ నోటీసు టు పబ్లిక్
ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడమేమనగా, పై తెలిపిన పిటీషనర్సు అన్న/తమ్ముడు. అయిన లేట్ ఎం.మస్తానప్ప S/O లేట్ తిక్కన్న గారు క్రింద కనపరచిన షెడ్యూలు దాఖల బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా పథకం చేసియున్నారు. సదరు ఎం.మస్తానప్ప తేది: 18-02-2019 నాడు మరణించినారు, ఇతనికి పెల్లి కాలేదు. ఇతనికి నామినిగా తల్లి పద్మశాలే రంగమ్మ ఉన్నారు. అయితే నామినిగా ఉన్న తల్లి రంగమ్మ కూడా తేది:25-05-2021న మరణించారు. సదరు పిటీషనర్స్ వారి అన్న / తమ్ముడు అయిన ఎం.మస్తానప్ప గారు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదోని నందు షెడ్యూలులో కనపరచిన ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా విత్ డ్రా చేసుకొనుటకు బ్యాంకు వారు సక్సెషన్ సర్టిఫికెట్ అడిగియున్నారు. ఇందుకోసం వారసులుగా పిటిషనర్స్ అయిన వీరు పై కోర్టులో సక్సెషన్ సర్టిఫికెట్ (Succession Certificate) కొరకు అర్జీ దాఖలు చేసినారు. కావున, ఈ విషయమై ఎవ్వరికైన ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు ముందు తేది: 20-12-2024 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వంతంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును. -ఎవ్వరూ హాజరు కాని యెడల పై కోర్టు వారు పిటీషనర్ పరముగా పై కేసును తీర్మానము చేయదురు.
:: SCHEDULE::
SCHEME NAME: PRADHANAMANTRI BHEEMA YOJAN PATHAKM
POLICY NUMBER: 900100016
ACCOUNT NUMBER: 1963491858
AMOUNT: Rs.2,00000
// కోర్టు వారి ఆర్డరు మేరకు //
వాయిదా తేది : 20-12-2024
శ్రీ పి.బి.ఆర్.ఎస్. కళ్యాణ్ రెడ్డి,
హుస్సేన్ సాని,
పిటీషనర్ తరపు వకీళ్లు,
ఆదోని-518301,
సెల్ : 9346807746